పంటలు సమృద్ధిగా పండాలి

స్వామివారికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్/పెబ్బేరు, మే 12 : పంటలు సమృద్ధిగా పండాలని స్వామివారిని వేడుకుంటు పూజలు చేసినట్లు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి మండలం చిమనగుంపల్లిలో లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని పూజలు చేశారు. అదేవిధంగా పెబ్బేరు మండలం కంచిరావుపల్లిలో భూ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి రథాన్ని లాగి భక్తులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో రాజేశ్వర్ రెడ్డి, శంషుద్దీన్, దామోదర్‌రావు, నారాయణ, విష్ణు, రమేశ్‌నాయక్, సత్య, స్వామి, చందు, వేణు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల : ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

వనపర్తి టౌన్ : ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

గద్వాల, మే 12 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి 75 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వనపర్తిలో..

వనపర్తి టౌన్, మే 12 : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ ఇన్‌చార్జి యాదయ్యతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణికి మొత్తం 66 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ ఉమాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మొబైల్‌ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలి

అలంపూర్ చౌరస్తా, మే 12 : ప్రజలు తమ మొబైల్ ఫోన్లను మిస్సింగ్ అయిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కానీ సీఈఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు సాంకేతికతను ఉపయోగించి వాటిని చేదిస్తామని ఎస్సై మహేశ్ అన్నారు. 8 నెలల కిందట పోగొట్టుకున్న 8 మంది మొబైల్ ఫోన్లను సోమవారం బాధితులకు ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌లో అందజేశామన్నారు.

వడదెబ్బ నుంచి ప్రజలు రక్షించుకోవాలి

వడదెబ్బపై వివరిస్తున్న కళాకారులు

మల్దకల్, మే 12 : ప్రస్తుత మండే ఎండాకాలంలో ప్రజలందరూ వడదెబ్బ బారి నుంచి కాపాడు కొని వేసవిలో జాగ్రత్తల తీసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి, కళాకారుల సంఘం అధ్యక్షుడు రాహుల్ అన్నారు. సోమవారం మండలంలోని మద్దెల బండలో కలెక్టర్ సంతోష్ ఆదేశాలతో, డీపీఆర్‌వో ఆరీఫుద్దీన్ సౌజన్యంతో కళాకారులు పాటల రూపంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రసాద్, రమాదేవి, కేశవులు, భూపతి, హజరత్, స్వామి, కవిత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిషాముక్త్ జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నిషాముక్త్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వనపర్తి టౌన్, మే 12 : వనపర్తి జిల్లాను నిషాముక్త్ జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ప్రజావాణి హాల్‌లో జరిగిన జిల్లాస్థాయి నార్కోటిక్ నిషాముక్త్ భారత్ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. మత్తు పదార్థాలు సేవించడంతో జరిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారుల తోపాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పోలీసులు గట్టి నిఘా పెట్టి గంజాయి రవాణా, సేవించేవారిని అరికట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య మాట్లాడుతూ తమ పిల్లలు మత్తుపానీయాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యాలయాలు, దవాఖానలకు వంద మీటర్ల పరిధిలో పాన్, గుట్కా, సిగరేట్ వంటి పదార్థాలు అమ్మకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీసీఆర్‌బీ ఎస్సీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 2017 నుంచి గంజాయి కేసులు నమోదు అవుతున్నాయని, ఇటీవల వీపనగండ్ల మండలంలోని ఒక పశువుల కాపరి గడ్డి వాములో గంజాయి దాచిపెట్టి ఉంచిన ఉదంతం వెలుగులోకి వచ్చిందన్నారు. అనంతరం నిషాముక్త్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, పీడీ డీఆర్డీవో ఉమాదేవి, అబ్కారీ శాఖ, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయమందించాలి

ఎర్రవల్లి చౌరస్తా, మే 12 : రోడ్డుప్రమాదంలో మృతి చెందిన నర్సింగ్ విద్యార్థులకు తక్షణసాయం అందించాలని సామాజిక విప్లవకారుడు ప్రేమ్‌కుమార్ సోమవారం కలెక్టర్ సంతోష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల 29వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు ఆదుకోవాలన్నారు. వారి కుటుంబాలు ఆర్థికంగా చాలా దీన స్థితిలో ఉన్నారన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

- ఎస్సీ రావుల గిరిధర్

విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్సీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, మే 12 : విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకుసాగాలని ఎస్సీ రావుల గిరిధర్ అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్సీ రావుల గిరిధర్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సీ మాట్లాడుతూ పిల్లలు చిన్న వయసు నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని అందు కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం ఇంటర్మీడియట్, పదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన సాయి శరణ్య, శ్రీచరణ్, భార్గవి, అమూల్య శ్రీలను శాలువాతో సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు అందాయని ఎస్సీ రావుల గిరిధర్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్సీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూతగాదాల ఫిర్యాదులు 2, కుటుంబ తగాదాల ఫిర్యాదులు 2, పరస్పర గొడవల ఫిర్యాదులు 3 మొత్తం 7 ఫిర్యాదులు అందాయని ఎస్సీ చెప్పారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతయ్య, యాదగిరి, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి, శ్యాంసుందర్, అరవింద్, ప్రకాశ్, రామ్మోహన్, శ్రీనివాసాచారి, శ్రీశైలం, విద్యార్థుల తల్లిదండ్రులు, ఫిర్యాదుదారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

- జోగుళాంబ గద్వాల ఎస్సీ శ్రీనివాస రావు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్సీ తోట శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, మే 12 : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజ సమస్యలను పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉండి ఫిర్యాదులపై చట్టపరంగా తక్షణమే చర్యలు తీసుకొవడం జరుగుతుందని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్సీ తోట శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 9 మంది తమ ఫిర్యాదులను ఎస్సీకి అందజేశారు. ఫిర్యాదులను ఎస్సీ స్వీకరించి వారి సమస్యలపై ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు సమక్షలో ఆరా తీసి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఎస్సీ మాట్లాడుతూ ప్రజల సంరక్షణనే ధ్యేయంగా పోలీస్ శాఖ కృషి చేస్తుందని, ప్రజలకు ఏ సమయంలోనైనా సరే వారి సమస్యను పోలీస్ శాఖ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్య, సీఐలు శ్రీను, రవి బాబు, టాటా బాబు ఉన్నారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

సదస్సులో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, మే 12 : రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని మున్నూర్‌లో 'రైతు ముగిట్లో.. శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ ఇజ్రాయిల్ దేశంలో నీటిని ఆదాచేస్తూ, అక్కడి రైతులు పండించే పంటల గురించి వివరించారు. రైతులు పండ్ల తోటలు, ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ మాట్లాడుతూ రైతులు క్రాప్ బుకింగ్ తప్పకుండా నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ మాట్లాడుతూ రైతులు పచ్చి రొట్ట ఎరువుగా ఉపయోగించే జీలుగ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రఘుయాదవ్, శాస్త్రవేత్తలు పుష్పావతి, సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి కరుణశ్రీ, ఏఈవో హరీశ్, రైతులు ఉన్నారు.

గురుకుల పాఠశాలలో పాము పట్టివేత

నాగుపామును పట్టుకున్న కృష్ణసాగర్

వనపర్తి టౌన్, మే 12 : జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో సోమవారం సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్ నాగుపాము పట్టి బంధించారు. క్రీడా మైదానంలో స్టేజీకి ఉన్న రంధ్రంలో నాగుపాము ఉన్నట్లు విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు హాజరైన హాజరైన తెలుపడంతో వెంటనే కృష్ణసాగర్‌కు సమాచారం ఇవ్వగా ఆయన అక్కడికి చేరుకొని పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. పాములు కనబడితే భయభ్రాంతులకు గురికాకుండా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బందించిన పామును అటవీ ప్రాంతంలో వదిలివేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్నేక్ సొసైటీ సభ్యులు గోపాల్ ఉన్నారు.

బండరాళ్లను తొలగించాలి

గద్వాల రూరల్, మే 12 : మండలంలోని వీరాపురం గ్రామం నుంచి పూడూరుకు వెళ్లే ప్రధాన తారు రోడ్డుకు ఇరువైపులా ఉండే పెద్ద బండరాళ్లను తొలగించాలని పూడూరు గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఉండే రైతులు తమ వ్యవసాయ పొలాల నుంచి పెద్ద రాళ్లను రోడ్డు పక్కకు తీసుకొచ్చి రోడ్డును కబ్జా చేస్తున్నారని, అదేవిధంగా రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా ఉండి అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. హరిత హారం మొక్కలు నాటడానికి కూడా స్థలం లేకుండా అక్రమించుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, చక్రధర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యుగేందర్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు నిర్వహణ సక్రమంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో రాణి

పాన్‌గల్, మే 12 : వరి ధాన్యం కొనుగోలు నిర్వహణ సక్రమంగా ఉండాలని వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి(డీసీవో) రాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల వ్యవసాయ అధికారులు, సింగిల్‌విండో కార్యనిర్వాహణ అధికారులకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని చేయాలని కోరారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దొడ్డు బియ్యానికి 17 తేమ శాతం, సన్నరకం ధాన్యానికి 14తేమ శాతం చొప్పున ధాన్యాన్ని రైతులనుంచి సేకరించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని కోరారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారులు రాజవర్ధన్ రెడ్డి, డాకేశ్వర్ గౌడ్, సీఈవో భాస్కర్ గౌడ్ వ్యవసాయ, సింగిల్‌విండో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

పెబ్బేరులో సన్మానం పొందిన నర్సులు

వనపర్తి టౌన్, మే 12 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని మహానీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మహానీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్ర ఝాన్సీ, అధ్యాపకులు శారద, జయ బాక్షి, షుక్రీయ, సరస్వతి, లీలావతిలను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవులు కన్నా సహాయం చేసే చేతులు మిన్న అంటారని, అనారోగ్యం బారిన పడి దవాఖానలో చేరిన వారికి సేవ చేసే గొప్ప మానవతామూర్తులు అని అన్నారు. కార్యక్రమంలో బాలేమియా, నాగరాజు, పాల్గొన్నారు.

నర్సులకు సన్మానం

పెబ్బేరు, మే 12 : పెబ్బేరులో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్లు కేతావత్ కృష్ణ, ఊర్మిళ, చరిత, బాలమణిను వైద్యాధికారి ప్రవీణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది పార్వతి, రాజశేఖర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

అమరచింత, మే 12 : పట్టణంలోని 8వ వార్డులో నివాసం ఉంటున్న బీఆర్ఎస్ నాయకుడు రమేశ్ తండ్రి వెంకటస్వామి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని స్థానికంగా బీఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సోమవారం ఉదయం వెంకటస్వామి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ప్రధాన కార్యదర్శి చిన్నబాలరాజు, మండలాధ్యక్షుడు రవికుమార్ యాదవ్, తదితరులు ఉన్నారు.

అఖిల పక్ష ఐక్యవేదిక వారోత్సవాలకు ఆహ్వానం

వనపర్తి టౌన్, మే 12 : మే 24వ తేదీన జరిగే అఖిల పక్ష ఐక్యవేదిక వారోత్సవాల ముగింపు సమావేశాలకు హాజరుకావాలని బీసీసింగ్, పూలే కమిటీ అధ్యక్షుడు సంగేమ్ సూర్యారావును ఆహ్వానించినట్లు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీశ్‌యాదవ్ చెప్పారు. సోమవారం సతీశ్‌యాదవ్ హైదరాబాద్‌లో పలువురిని కలిసి మే 24న జరిగే ఐక్యవేదిక సమావేశాలు, మాజీ ఎమ్మెల్యే జయరాములు వర్ధంతి సభలో పాల్గొనాలని ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. జయరాములు వర్ధంతి, ఐక్యవేదిక వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 42సార్లు గెలిచిన బీసీ ఎమ్మెల్యేల జయంతులు, వర్ధంతులను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

మానవాళికి బుద్ధుడు ఆదర్శం

వనపర్తి టౌన్, మే 12 : మానవాళికి బుద్ధుడు ఆదర్శమని ప్రజావాగ్గేయకారుడు రాజరాంప్రకాశ్ అన్నారు. సోమవారం బుద్ధ పూర్ణిమను పురస్కరించుకొని మహానీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఏకో పార్కులో ఉన్న బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి ఆయన జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గిరిరాజాచారి, డాక్టర్ నర్సింహశర్మ, దేవన్ననాయుడు, బాలేమియా, వెంకటస్వామి, రాములు యాదవ్, తిరుపతయ్య, అంజిరెడ్డి, రామాచారి, శ్రీనివాసులు, కురుమూర్తి, బలరాం, సాయిచంద్ర ప్రసాద్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

అర్హులకే మంజూరు చేయాలి

గట్టు, మే 12 : ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే మంజూరు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీంపాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్టు మండలంలోని పెంచికలపాడులో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని, అర్హులు మాత్రం ఇళ్ల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ చేతులెత్తేసిందని విమర్శించారు. కాగా అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు హాలీంపాషా తెలిపారు.

తైబజార్ రద్దుపై కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు

అయిజ, మే 12 : అయిజ మున్సిపాలిటీ తైబజార్ వేలం రద్దుపై మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గత నెల 30న నిర్వహించిన తైబజార్ వేలంలో కైవసం చేసుకున్న గుత్తేదారు రవీందర్ (యోబు) తైబజార్‌ను కమిషనర్ అకారణంగా రద్దు చేశారని, ఈ నెల 6న హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మున్సిపాలిటీలో తైబజార్ వసూళ్లు గత నెల 25న మున్సిపల్ కమిషనర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. 29 వరకు తైబజార్‌కు దరఖాస్తులు స్వీకరించారు. 30న కమిషనర్ ఆధ్వర్యంలో తైబజార్ వేలంలో ఇద్దరు గుత్తేదారులు పాల్గొనగా, రవీందర్ రూ.21.48లక్షలకు దక్కించుకున్నారు. మున్సిపల్ నిబంధనల మేరకు రూ.5లక్షల డీడీతోపాటు రూ.9లక్షల వ్యాలువేషన్ ధ్రువీకరణ పత్రం సమర్పించినట్లు ఫిర్యాదు చేశాడు. 3/4 వంతు 6న డీడీ అందజేయాలని కమిషనర్ తెలిపారని పేర్కొన్నారు. 3/4వ వంతు డీడీ చెల్లించేందుకు గడువు ఉన్నప్పటికీ రాజకీయ ఒత్తిడి మేరకు తనకు ఎలాంటి సమాచారం లేకుండా ఈనెల 3న తైబజార్ వేలంను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారని పేర్కొన్నారు. దీంతో హైకోర్టు విచారణ చేసి, మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది.

ఈ విషయమై కమిషనర్ సైదయ్యను వివరణ కోరగా హైకోర్టు ద్వారా నోటీసులు కార్యాలయానికి చేరుకున్నాయని తెలిపారు. వీటిపై హైకోర్టుకు సమాధానం చెబుతామని పేర్కొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో ప్రిన్సిపల్ జడ్జి

అలంపూర్,మే 12 : పట్టణంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను మహబూబ్‌నగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి పాపిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఉభయ ఆలయాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి వెంట స్థానిక కోర్టు జడ్జి మిథున్ తేజ ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

పాన్‌గల్, మే 12 : ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆవాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.జబ్బార్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ప్రజాసంఘాల నాయకులతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు హాజరై మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బాలరాజు, ధర్మయ్య, భాస్కర్, రేణుక, అలివేల, తిరుపతయ్య, చంద్రశేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

గద్వాల రూరల్/గద్వాల అర్బన్, మే 12 : గద్వాల, దరూర్ మండలాల్లోని జమ్మిచేడు, ఉప్పేరు, మన్నాపురం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలు సక్రమంగా చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ అన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులకు ఇచ్చే వేతనాలలో కోత విధించిన జమ్మిచేడు, మన్నాపురం, ఉప్పేరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జమ్మిచేడు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు సంతోషమ్మకు 8నెలల వేతనాలకు గానూ రూ.96వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.42వేలు మాత్రమే ఇచ్చారని, మన్నాపురం పాఠశాలలో పనిచేస్తున్న కార్మికురాలుకు రూ.30వేలకు రూ.18వేలు మాత్రమే చెల్లించారు. అదేవిధంగా ఉప్పేరు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న కార్మికురాలుకు రూ.45వేలకు రూ.30వేలు చెల్లించారన్నారు. అదేవిధంగా మండలంలోని తుర్కోనిపల్లి, బీరెల్లి గ్రామాల ప్రధానోపాధ్యాయులకు వేతనాలు విడుదలైనా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలల హెచ్ ఎంలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంతోషమ్మ, రేణుక, సువార్తమ్మ, హనీఫ, హజిరాబి, మల్లమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో దొంగతనాలను అరికట్టవచ్చు

సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకుమార్

పెద్దమందడి, మే 12 : సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలను అరికట్టవచ్చని ఎస్సై శివకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని దొడగుంటపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో